

from the desk of ...

పిట్టల రవీందర్
స్వతంత్ర పరిశోధకులు

# తెలంగాణ రాష్ట్రం - మత్స్యపరిశ్రమ - అభివృద్ధి - కీలకాంశాలు

**లక్ష్యాలు:**

1) 'ఇన్‌ల్యాండ్ ఫిషరీస్'లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే 'ప్రధమ' స్థానంలో నిలబెట్టడం
2) జలవనరులను గరిష్టస్థాయిలో వినియోగించుకుని 'జల వ్యవసాయం' (చేపలసాగు) అభివృద్ధి చేయడం
3) మత్స్యపరిశ్రమలో ఇప్పుడున్న ఉపాధి అవకాశాలను గరిష్టస్థాయికి పెంచడం.
4) నిరుపేదవర్గాలకు ఆహారభద్రత కల్పించడం, గ్రామీణ ప్రాంతాలలో పౌష్టికాహారాన్ని అందించడం
5) చేపల ఆహారంపై అవగాహన కల్పించడంద్వారా చేపల వినియోగాన్ని గరిష్టస్థాయికి పెంచడం
6) 'నీలి విప్లవం' (బ్లూ రెవెల్యూషన్) అమలులో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలబెట్టడం

## కీలకాంశాలు

**1) ఫిషరీస్ పాలసి:-** తెలంగాణ రాష్ట్రంలో మత్స్య పరిశ్రమను సమగ్రంగా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేకంగా ఒక విధానం (పాలసీ) రూపొందించుకుని అమలు పరిచాల్సిఉన్నది. ముఖ్యంగా మత్స్యపరిశ్రమలో గణనీయమైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలు, వివిధ దేశాలలో అమలులో ఉన్న మత్స్యపారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్రంలోని జలవనరులు, చేపల పెంపకంలో ఇక్కడ పాటిస్తున్న సాంప్రదాయ విధానాలు, ప్రపంచ వ్యాపితంగా చేపల పెంపకంలో వస్తున్న మార్పులు, ఈ రంగంలో శాస్త్రసాంకేతికపరంగా వస్తున్న ఆధునిక విధానాలు, ప్రజల ఆహార అలవాట్లు, మార్కెట్ పోటీ, తదితర కీలకమైన అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని **'తెలంగాణ రాష్ట్ర సమగ్ర మత్స్యపారిశ్రామిక విధానం'** రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉపరితల జనవనరుల్లో చేపలను పెంచే ప్రక్రియ (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)కు సంబంధించిన ముఖ్యంగా మూడు రకాలైన జల వనరులు మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయి. వీటిలో సాంప్రదాయకంగా కొనసాగుతున్న నదులు, వాగులు, వంకలు, తదితర సహజ సిద్ధమైన జల ప్రవాహాలు ... పూర్వకాలంలో నిర్మించిన గొలుసుకట్ట చెరువులు, కుంటలు ... మరియు సాగునీటిప్రాజెక్టులు, రిజర్వాయర్లు (జలాశయాలు) ముఖ్యమైనవి. ఈ మూడు ప్రధాన వ్యవస్థలకు సంబంధించి అమలు పరచాల్సిన వేర్వేరు విధానాలను రూపొందించవలసిన అవసరం ఉన్నది. మన దేశంలో చాలా రాష్ట్రాలు సాగునీటిప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపలసాగునకు సంబంధించి ప్రత్యేకమైన 'పాలసీ'లను అమలు పరుస్తున్నాయి. అట్లాగే, తెలంగాణ రాష్ట్రంలోని పరిస్థితులు, అవకాశాలు, ఇక్కడి సాంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని ఈ 'తెలంగాణ రాష్ట్ర సమగ్ర మత్స్యపారిశ్రామిక విధానం' రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉపరితల జలవనరుల చేపలపెంపకానికి సంబంధించి ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించేందుకు కేంద్రప్రభుత్వం ఇప్పటికే కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా ముసాయిదాను రూపొందించేందుకు 13మంది నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. 2017 జనవరి నాటికి కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న 'ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ పాలసీ' అందుబాటులోకి రానున్నది. అయితే ఇప్పటికే మన దేశంలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఒడిషా, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలు ప్రత్యేక మత్స్యపారిశ్రామిక విధానాలను రూపొందించుకున్నాయి.

**1) ఫిషరీస్ చట్టం:** – తెలంగాణ రాష్ట్రం రూపొందించుకునే 'తెలంగాణ రాష్ట్ర సమగ్ర మత్స్యపారిశ్రామిక విధానం' పకడ్బందీగా అమలుపరిచేందుకు ఆ విధానానికి చట్టబద్ధతను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మత్స్యపారిశ్రామిక విధానాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా అమలుపరిచేందుకు అవసరమైన సాధారణ పరిస్థితులను ఈ చట్టం ద్వారా నెలకొల్పేందుకు అవకాశాలు కలుగుతాయి. ఉపరితల జలవనరుల వినియోగంలో ఆయా సంస్థలు, భిన్నవర్గాలకు సంబంధించిన లబ్దిదారులు, వివిధ ప్రభుత్వ శాఖలు, రైతులు, మత్స్యకారులు, ఇతర వృత్తులకు సంబంధించిన వారిమధ్యన ఘర్షణవాతావరణాన్ని నివారించేందుకు ఈ **'ఫిషరీస్ చట్టం'** ఉపయోగపడుతుంది. మన దేశంలో మత్స్యశాఖ వ్యవసాయమంత్రిత్వశాఖకు అనుబంధంగా కొనసాగుతున్నది. అదేవిధంగా వ్యవసాయశాఖ కేంద్ర, రాష్ట్ర పరిధిలోని ఉమ్మడి జాబితాలో ఉన్న కారణంగా ఇందుకు సంబంధించిన చట్టాలను రాష్ట్రాలు తమ పరిస్థితులకు అనుగుణంగా, స్థానిక అవసరాలకు తగినరీతిలో సవరించుకునేందుకు అవకాశాలున్నప్పటకీ 'ఇండియన్ ఫిషరీస్ చట్టం–1897 (సవరణలు 1948,1950) అనుసరించి మాత్రమే రూపొందించుకోవాలి. అంతేకాకుండా రాష్ట్రాలు తీసుకువచ్చే ఫిషరీస్ చట్టాలను భారత రాష్ట్రపతి ఆమోదించాల్సిఉంటుంది. అందువల్లనే చాలా రాష్ట్రాలు తమ అవసరాలకు తగినట్లుగా, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా 'మత్స్య పారిశ్రామిక విధానాలు' రూపొందించుకుని అమలు పరుస్తున్నాయి. అయితే దేశంలో 'ఇన్‌ల్యాండ్ ఫిషరీస్'లో అగ్రభాగాన ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాత్రం తమ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక ప్రత్యేక చట్టాన్ని (పశ్చిమ బెంగాల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ చట్టం 1984)రూపొందించుకుని అమలు పరుస్తున్నది. 2003లో గుజరాత్ రాష్ట్రం కూడా తమ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి అవసరమైన రీతిలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించుకున్నది.

**3) ఫిషరీస్ కార్పోరేషన్:–** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్థుతం అందుబాటులో ఉన్న ఉపరితల నీటి వనరులతోపాటు కృష్ణా, గోదావరి నదీల వినియోగ లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమలు పరుస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, ఇందులో భాగంగా నిర్మించతలపెట్టిన రిజర్వాయర్లు, భవిష్యత్తులో అందుబాటులోకి రాబోతున్న నీటివనరులను ఉపరితల జలవనరుల చేపల పెంపకానికి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) అనుగుణంగా పలు పథకాలను రూపొందించుకుని, పకడ్బందీ ప్రణాళికతో అమలు పరిచి ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధమ స్థానంలో నిలిపేందుకు అనుగుణంగా 'తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ డెవెలప్‌మెంట్ కార్పోరేషన్' (బోర్డు లేదా అథారిటీ)ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలంగాణలోని జలవనరులు, మత్స్యకారుల స్థితిగతులు, కేంద్ర ప్రభుత్వం అమలు జరుగుపుతున్న మత్స్యపారిశ్రామిక అభివృద్ధి పథకాలు, తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర మత్స్యపారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టవలసిన పథకాలు, మత్స్యపరిశ్రమ అభివృద్ధితో ముడిపడిఉన్న ఇతర అంశాలు, జాతీయ అంతర్జాతీయంగా మత్స్యపరిశ్రమలు కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ఈ రంగంలో శాస్త్ర సాంకేతికంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక పద్ధతులు తదితర అంశాలన్నింటినీ ఈ 'పిషరీస్ కార్పోరేషన్' కార్యాచరణలో భాగస్వామ్యం చేయాలి. మత్స్యపరిశ్రమలో పురోభివృద్ధిని సాధిస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో అక్కడి రాష్ట్ర 'ఫిషరీస్ కార్పోరేషన్' నిర్వహిస్తున్న పాత్రను అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా, ఇక్కడ నిర్దేశించుకునే లక్ష్యాలను అధిగమించే విధంగా ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కలిగిన 'తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ డెవెలప్‌మెంట్ కార్పోరేషన్'ను ఏర్పాటు చేసుకోవాలి. ఈ లక్ష్యసాధనలో సంపూర్ణమైన అవగాహన, చిత్తశుద్ధి కలిగి, దీక్షాదక్షతలు కలిగిన వ్యక్తిని ఈ 'ఫిషరీస్ కార్పోరేషన్'కు 'చైర్మెన్'గా నియమించుకోవాలి.

**నేపథ్యం:–** చేపల ఎగుమతిద్వారా మనదేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిపెట్టడంతోపాటు, లక్షలాది మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థికస్వావలంబన సాధించడం, సమాజంలోని అట్టడుగువర్గాల ప్రజలకు ఆహారభద్రతను చేకూర్చడం, ప్రజలకు ఆరోగ్యరక్షణకు అవసరమైన పౌష్టికాహారాన్ని తక్కువఖర్చుతో సమకూర్చడంలాంటి బహుళ ప్రయోజనాలు తెలంగాణలో మత్స్యపరిశ్రమ అభివృద్ధి ద్వారా సాధ్యపడుతుంది. తెలంగాణలో మత్స్యపరిశ్రమకు

ఇప్పటివరకూ జరిగిన అన్యాయాలని, నిర్లక్ష్యాన్ని, అణచివేతలను సవరించుకుని, మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఇక్కడ ఉన్న అవకాశాలను సమగ్రంగా అధ్యయనంచేసి, మత్స్యపారిశ్రామిక విధానాన్ని రూపొందించుకుని, ప్రణాళికాబద్ధంగా అమలు పరచగలిగితే తెలంగాణ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమద్వారా వేలాదిమందికి అదనంగా ఉపాధిని కల్పించేందుకు అవకాశాలున్నాయి.

**అవకాశాలు:-** తెలంగాణ ప్రాంతంలో మత్స్యపరిశ్రమను సీమాంధ్ర పాలకులు బుద్ధిపూర్వకంగానే నిర్లక్ష్యంచేసారు. ఉపరితల జనవనరుల్లో చేపలను పెంచే ప్రక్రియ (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)లో తెలంగాణ ప్రాంతంలో దేశంలోనే అత్యున్నతమైన అవకాశాలున్నప్పటికీ పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో సుమారు 5573 కిలోమీటర్ల పొడవైన నదులు, కాలువలు ప్రవహిస్తున్నాయి. వీటికి తోడుగా లక్షా 85 వేల హెక్టార్ల విస్తీర్ణంలో నీటినిలువ సామర్థ్యం కలిగిఉన్న ప్రాజెక్టులున్నాయి. అంతేకాకుండా నాలుగులక్షల రెండువేల హెక్టార్ల విస్తీర్ణంలో నీటినిలువ సామర్థ్యం కలిగిఉన్న చెరువులు, కుంటలు, చిన్ననీటి వనరులు, సాంప్రదాయ నీటి వనరులు కూడా అందుబాటులో ఉన్నాయి. అంటే తెలంగాణ రాష్ట్రంలో మొత్తం **ఐదు లక్షల 87వేల హెక్టార్ల విస్తీర్ణం** కలిగిన నీటివనరులు ఉపరితల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) చేపట్టడానికి అందుబాటులో ఉన్నాయి. ఇన్‌ల్యాండ్ ఫిషరీస్‌లో ప్రతిహెక్టారుకు జాతీయ సగటు ఉత్పత్తి సగటు మూడున్నరటన్నులు ఉండగా, తెలంగాణలో కనీసం మూడు టన్నులు కూడా ఉత్పత్తి కావడంలేదు. కొన్ని రాష్ట్రాల్లో ప్రతిహెక్టారుకు గరిష్ఠంగా ఐదు టన్నులదాకా చేపల ఉత్పత్తి చేస్తున్నరికార్డులు నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఉపరితల నీటివనరుల్లో ప్రతిహెక్టారుకు చేపల ఉత్పత్తిని కనీసం జాతీయ స్థాయి మూడున్నరటన్నులకు పెంచగలిగినా, తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న **ఐదు లక్షల 87వేల హెక్టార్ల విస్తీర్ణం**లో కనీసం 70శాతం నీటిలభ్యతమీద ఆధారపడినా కనీసం 15 లక్షల టన్నుల చేపలను తెలంగాణ రాష్ట్రంలో ఉత్పత్తి చేసేందుకు అవకాశాలున్నాయి. అంతేకాకుండా కృష్ణా, గోదావరి నదీజలాల వినియోగంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, వాటికి అనుబంధంగా నిర్మించే ప్రధాన కాలువల్లో అత్యాధునిక పద్ధతుల్లో చేపట్టే చేపల పెంపకం ద్వారా కనీసం మరో ఐదు లక్షల టన్నుల చేపలను ఉత్పత్తిని పెంచి, తెలంగాణ రాష్ట్రంలో ఏటా సగటున 20 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేసేఅవకాశాలున్నాయి. దేశంలోనే చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో గత సంవత్సరం వార్షిక చేపల ఉత్పత్తి సుమారు 14 లక్షల టన్నులుగా రికార్డు నమోదయ్యింది. పైన సూచించిన లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో చేపల ఉత్పత్తిని పెంచుకోగలిగితే మన రాష్ట్రం ఇన్‌ల్యాండ్ ఫిషరీస్‌లో దేశంలోనే అగ్రభాగాగ నిలేచేందుకు అవకాశం ఉంది. తద్వారా తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగానూ, చేపల ఉత్పత్తికి అనుబంధ కార్యక్రమాలను చేపట్టడంద్వారా కనీసం పది లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వీలున్నది.

**భవిష్యత్తు:-** దేశంలోని **'ఇన్‌ల్యాండ్ ఫిషరీస్'** మత్స్యపరిశ్రమ అభివృద్ధిచెందిన రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం నీటినిలువ సామర్థ్యంలో మూడవ స్థానంలో ఉంటే, చేపల ఉత్పత్తిలో మాత్రం ఎనమిదన స్థానంలో ఉన్నది. ఇక్కడ అందుబాటులో ఉన్న సాంప్రదాయ నీటివనరుల సౌలభ్యం ఫలితంగా 'ఇన్‌ల్యాండ్ ఫిషరీస్' చేపల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రధమ స్థానంలో నిలిపేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ ముఖ్యంగా మత్స్య సహకార సంఘాలమీదనే ఆధారపడిఉన్నది. వీరికితోడు సాంప్రదాయంగా తరతరాలనుండి చేపల వేటమీద ఆధారపడిన కొన్ని వెనుకబడిన, ముస్లీం, దళిత, గిరిజన, ఆదివాసీ కులాలకు చెందిన సమూహాలు కూడా చేపల వృత్తిని కొనసాగిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన మత్స్యసహకార సొసైటీ నిబంధనల ప్రకారం ప్రతి హెక్టారు (రెండున్నర ఎకరాల నీటివిస్తీర్ణం)కు ఒకరికి చొప్పున ప్రాధమిక మత్స్యసహకార సంఘాలలో సభ్యత్వం ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో **ప్రస్తుతం 3717 మత్స్యసహకార సంఘాలలో మొత్తం 2,38,797 మంది సభ్యులు**గా ఉన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఎకరానికి ఒకరికి చొప్పున

మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని ప్రతిపాదించింది. ఈ విధానం అమలులోకి వస్తే తెలంగాణలో మత్స్యసహకార సంఘసభ్యుల సంఖ్య కనీసం రెట్టింపు అంటే ఐదులక్షలకుమించి చేరుకునేందుకు అవకాశం ఉంది. అంతేకాకుండా కృష్ణా, గోదావరి నదీజలాల వినియోగంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, వాటికి అనుబంధంగా నిర్మించే ప్రధాన కాలువల్లో చేపల పెంపకాన్ని చేపట్టడంద్వారా కనీసం మరో లక్షమందికి అదనంగా మరో లక్షమందికి ఉపాధి అవకాశాలను పెంచేందుకు వీలుకలుగుతుంది.

ఈ పరిస్థితుల నేపథ్యంలో పైన పేర్కొన్న లక్ష్యాలను సాధించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టాల్సి ఉన్నది. ఇందుకు అనుగుణంగా ఒక సమగ్రమైన 'తెలంగాణ రాష్ట్ర మత్స్యపారిశ్రామిక విధానం' రూపొందించుకుని, దానిని సమర్థవంతంగా అమలు పరిచేందుకు ఈ క్రింద సూచించిన సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకోవాల్సిందిగా మనవి.

**చర్యలు:-** 'తెలంగాణ రాష్ట్ర సమగ్ర మత్స్యపారిశ్రామిక విధానం' రూపొందించుకుని ప్రణాళికాబద్ధంగా అమలు పరచాలి. పరితలజలవనరుల చేపల ఉత్పత్తి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ సెక్టార్)లో దేశంలో అగ్రభాగాన నిలిచిన పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, బీహార్, ఒడిస్సా, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలు రూపొందించుకుని అమలు పరుస్తున్న ఆయా రాష్ట్రాల 'మత్స్యపారిశ్రామిక విధానాలను' పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర పరిస్థితులకు అనువైన రీతిలో అన్వయించుకుని 'తెలంగాణ రాష్ట్ర మత్స్యపారిశ్రామిక విధానం' తయారుచేసుకోవాలి.

తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపలపెంపకానికి సంబంధించిన ప్రత్యేక చట్టాన్ని, విధానాన్ని రూపొందించుకుని అమలు పరచాలి. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి నదులతోపాటు ఇతర ఉపనదులకు సంబంధించిన 'జల వ్యవసాయం' (చేపల పెంపకం)పై ఒక సమగ్రమైన విధానాన్ని(పాలసీ) రూపొందించుకోవాలి. సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపల పెంపకానికి సంబంధించిన ప్రత్యేక విధానం (పాలసీ), చట్టం (యాక్ట్)లను వేర్వేరుగా రూపొందించుకుని పకడ్బందీగా అమలుపరచాలి.

రాష్ట్రంలోని జలవనరుల్లో పంపిణీ చేయడానికి అవసరమైన చెపపిల్లల పెంపకాన్ని స్థానికంగానే చేపట్టాలి. ఇప్పుడున్న అవసరాలను అనుసరించి తెలంగాణ రాష్ట్రంలోని చెరువుల్లో చేపలను పెంచడానికి ప్రతియేటా కనీసం 300 కోట్ల చేపపిల్లలు అవసరమవుతాయని అంచనా. కానీ మన రాష్ట్రంలో స్థానికంగా కేవలం 3 నుండి 4 కోట్ల చేపపిల్లలను పెంచేందుకు మాత్రమే అవకాశాలున్నాయి. మిగిలిన చేపపిల్లల విత్తనాలను ఇతర రాష్ట్రాలనుండి (ముఖ్యంగా ఆంధ్రానుండి) కోట్లాది రూపాయలను వెచ్చించి దిగుమతి చేసుకుంటున్నాము. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన చేపపిల్లల విత్తనాలను స్థానికంగానే పెంచుకునేందుకు అవసరమైన కేంద్రాల(నర్సరీలు) ఏర్పాటును ప్రోత్సహించాలి. ఫలితంగా కోట్లాదిరూపాయల ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోగలగడంతోపాటు వేలాదిమంది యువకులకు శాశ్వితంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుకలుగుతుంది.

**కేజ్ కల్చర్:-** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్మిస్తున్న కృష్ణా, గోదావరి నదీజలాల వినియోగ ప్రాజెక్టుల ఫలితంగా మన రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి అవకాశాలు కలగడంతోపాటు మత్స్యపరిశ్రమ అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు సమకూరనున్నాయి. ముఖ్యంగా ఉపరితలజలవనరుల చేపల ఉత్పత్తి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ సెక్టార్)లో ఈ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు అత్యంత ముఖ్యమైన పాత్రను పోషించనున్నాయి. ఉపరి తలజలవనరుల చేపల ఉత్పత్తి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ సెక్టార్)లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ప్రధాన పాత్రను నిర్వహించనున్నాయి.. వీటిల్లో ప్రధానంగా 'కేజ్ కల్చర్' విధానం అమలు పరిచేందుకు గణనీయమైన అవకాశాలు లభిస్తాయి. అందువల్ల తెలంగాణ రాష్ట్రంలో 'కేజ్ కల్చర్' విధానాన్ని విస్తృతప్రాతిపదికన అమలు పరిచేందుకు అవసరమైన చర్యలను ప్రత్యేకంగా తీసుకోవాలి.

ఇందుకు అవసరమైన ప్రత్యేక విధానాన్ని రూపొందించుకోవాలి. 'కేజ్ కల్చర్' విధానంలో చేపలు పెంచే ప్రక్రియలో భాగంగా మన రాష్ట్రం నుండి అనేకమంది మత్స్యకారులను శిక్షణకోసం జార్ఖండ్ రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పరిశీలనకు పంపించడం జరిగింది. తెలంగాణలోని దాదాపు ఆరు సాగునీటి జలాశయాలలో 'కేజ్ కల్చర్' విధానంలో చేపలను పెంచే ప్రయత్నాలు కూడా గత సంవత్సరం జరిగాయి. అయితే అనుభవరాహిత్యం కారణంగా 'కేజ్ కల్చర్' విధానం మన దగ్గర ఆశించిన రీతిలో సత్ఫలితాలు ఇవ్వకపోయినప్పటికీ, రానున్న కాలంలో మరింత పకడ్బందీగా ఈ విధానంలో చేపలను పెంచేందుకు అవసరమైన అనుభవాన్ని మాత్రం కలిగించింది. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెద్దయెత్తున 'కేజ్ కల్చర్' విధానాన్ని అమలు పరిచేందుకు ఒక ప్రత్యేకమైన పాలనా, పర్యవేక్షణా వ్యవస్థను, శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకావాల్సిన అవసరం ఉన్నది. అంతేకాకుండా 'కేజ్ కల్చర్' పద్ధతిలో చేపలను పెంచేందుకు అవసరమైన 'సీడ్' మరియు 'ఫీడ్' ఉత్పత్తి కేంద్రాలను స్థానికంగానే అభివృద్ధి చేసుకోగలిగితే ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చునని ఇటీవలి అనుభవాలు చెబుతున్నాయి. దీనికితోడు 'కేజ్ కల్చర్'లో పెరిగిన చేపలకు మార్కెట్ సౌలభ్యాన్ని కలిగించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపట్టవలసి ఉన్నది.

**సహకార చట్టం:-** మత్స్యపారిశ్రామిక సహకార చట్టాన్ని ప్రత్యేకంగా రూపొందించాలి. రాష్ట్ర స్థాయిలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్యను బలోపేతం చేసి, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ఈ సమాఖ్య కార్యకలాపాలను పరిమితం చేయాలి. మత్స్యపరిశ్రామిక సహకార సంఘాల నిర్వహణలో సహకారశాఖ ప్రమేయాన్ని తొలగించాలి. మత్స్యకారులందరికీ మత్స్యసహకార సంఘాలలో సభ్యత్వం లభించే విధంగా ప్రస్తుతమున్న 'హెక్టారు' పరిమితిని 'ఎకరానికి' ఒకరికి చొప్పున సవరించాలి. మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలను మన రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా సమన్వయం సాధించాలి. రాష్ట్రస్థాయిలో ఇటీవలి కాలం వరకూ కొనసాగిన 'మత్స్య సహకార సంఘాల సమాఖ్య'ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించుకుని రాష్ట్రంలోని మత్స్యకార్మికుల సంక్షేమం, ఉపాధి, మౌళికవసతుల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలి. రాష్ట్రంలో ఇతర వృత్తులకు సంబంధించిన 'కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్' సంస్థల ద్వారా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆర్థిక సహకారం అందిస్తున్నట్లుగానే, తెలంగాణ మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య'కు కూడా గ్రాంట్లు, బడ్జెట్ కేటాయింపులు తదితర పద్ధతుల్లో ఆర్థిక సహకారం అందించాల్సిన అవసరం ఉన్నది.

కనీస సౌర్యాలు:- మత్స్యపరిశ్రమలో వేళ్లూనుకుని వేధిస్తున్న మధ్యదళారీ వ్యవస్థను సమూలంగా రూపుమాపేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. మత్స్యసహకార సంఘాలకు చెరువుల్లో చేపవిత్తనాలు అందించే దశ నుండి మార్కెట్‌లో చేపల విక్రయం పూర్తయ్యే వరకూ అన్ని దశల్లోనూ ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండి సహాయ, సహకారాలు అందించే ఏర్పాటు జరగాలి. వ్యవసాయపంటలకు అందించిన రీతిలోనే పంటల భీమా, విత్తనాల సరఫరా, దాణా కేంద్రాల ఏర్పాటు, స్థానికంగా మార్కెట్ సౌకర్యం, చేపలను నిలువ ఉంచుకునేందుకు అవసరమైన కోల్డ్‌స్టోరేజీ సదుపాయం, కనీస మద్దతు ధర, పంటల భీమా, ప్రకృతివైపరీత్యాలు ఎదురైన సందర్భాలలో నష్టపరిహారాలు, ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, మత్స్యకారులకు జీవిత భీమాను వర్తింపజేయడం, గీతపనివారికి మరియు చేనేత పనివారికి అమలు చేస్తున్న పద్ధతిలోనే 50 సంవత్సరాల వయస్సు నిండిన మత్స్యకారులకు 'ఆసరా' పథకాన్ని వర్తింపజేసి వృద్ధాప్య పింఛన్లు అందించడంలాంటి సంక్షేమ చర్యలను అమలు పరచాలి. మత్స్యకార్మికులకు 'డబుల్ బెడ్‌రూం' ఇండ్ల కేటాయింపులో ప్రత్యేక వాటాను అమలు చేయడం, కమ్యూనిటీహాల్స్ నిర్మాణానికి ఆర్థికసహాయం, దళిత, ఆదివాసీ గిరిజనుల విద్యార్థులకు నిర్వహిస్తున్న రీతిలోనే మత్స్యకారుల పిల్లలు విద్యలో రాణించేందుకు కనీసం జిల్లాకు ఒకటి చొప్పున ప్రత్యేకంగా గురుకుల పాఠశాలల ఏర్పాటు, ఉన్నత విద్యావకాశాల్లో ప్రత్యేక కోటాను కేటాయించడంలాంటి చర్యలు తీసుకోవాలి.

**సాంప్రదాయ పద్ధతులు:–** సాంప్రదాయ నీటివనరుల్లో పెరిగే చేపల్లోనే పోషకవిలువలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు నమ్ముతారు. అంతేకాకుండా చెరువుల్లో పెరిగే చేపలు సహజసిద్ధంగా చెరువుల్లో లభ్యమయ్యే పదార్థాలనే ఆహారంగా తీసుకోవడంవల్ల, ప్రాజెక్టులోనో, అక్వాకల్చర్ పద్ధతుల్లోనో, కేజ్ కల్చర్‌లోనో చేపల పెంపకానికి కృత్రిమ ఆహారాన్ని అందించవలసిన అవసరం ఉండదు. అందువల్ల ఇతర పద్ధతుల్లో కృత్రిమంగా నిర్వహించే చేపల పెంపకం కంటే, సాంప్రదాయ నీటివనరుల్లో చేపలను పెంచడానికయ్యే ఖర్చుకూడా అనేక రెట్లు తక్కువగా ఉంటుంది. అందువల్లనే తెలంగాణ ప్రాంతంలో సాంప్రదాయ నీటివనరుల్లో పెంచే చేపల ధరలు సముద్రచేపలకంటే, ప్రాజెక్టుల్లో పెంచే చేపలకంటే చాలా తక్కుగా ఉండి సాధారణ ప్రజలకు చేప ఆహారం అతిసులువుగా లభ్యమవుతున్నది. సాంప్రదాయపద్ధతుల్లో చెరువుల్లో, కుంటల్లో, చిన్ననీటి వనరుల్లో, సహజ జల ప్రవాహాల్లో పెరిగే చేపల్లో లభ్యమయ్యే పోషక పదార్థాలపై ప్రజల్లో విరివిగా ప్రచారం నిర్వహించాలి. తరతరాలుగా చిన్ననీటివనరుల్లో సహజసిద్ధంగా పెరిగే చేపల రకాలపై ఈ తరం ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నం చేయాలి. వివిధ కారణాలవల్ల అంతరించిపోతున్న చేపజాతులను సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

**చేపల ఆహారం:–** తెలంగాణ రాష్ట్రంలో సగటు చేపల ఆహార వినియోగం జాతీయ సగటుకంటే చాలా తక్కువగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో చేపల వినియోగం పెంచేందుకు అనేక అవకాశాలున్నాయి. **జాతీయ స్థాయిలో చేపల సగటు వినియోగం ప్రతినెలలో, ప్రతి వెయ్యిమంది జనాభాలో 236గా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కేవలం ప్రతి వెయ్యిమంది జనాభాలో కేవలం 163మంది మాత్రమే** చేపలు తింటున్నారు. దేశంలోనే అత్యధికంగా త్రిపుర రాష్ట్రంలో ప్రతి వెయ్యిమందిలో 957మంది, గోవాలో 943మంది, అస్సాంలో 886మంది, పశ్చిమ బెంగాల్‌లో 862మంది, కేరళ రాష్ట్రంలో 851మంది చేపల ఆహారాన్ని వినియోగిస్తున్నారు. అయితే కేరళ రాష్ట్రంలో చేపలను ఆహారంగా తీసుకునేవారి సంఖ్యను అనుసరించి దేశంలో ఐదవ స్థానంలో ఉన్నప్పటికీ, చేపల వినియోగంలో మాత్రం ఈ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నది. ఈ రాష్ట్రంలో చేపలను ఆహారంగా తీసుకునేవారు ప్రతినెలా సగటున రెండు కిలోలకు పైగా వినియోగిస్తున్నారు.

మన రాష్ట్ర జనాభాలో సుమారు 64శాతం మంది మాంసాహారుగా ఉన్నప్పటికీ, చేపల ఆహారం తీసుకోవడంలో మాత్రం జాతీయ సగటు కంటే ఎంతో వెనకబడిపోయి ఉన్నాము. రాష్ట్రంలోని మాంసాహారుల్లో కనీసం సగం మందికైనా చేపల ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురాగలిగితే తెలంగాణలో చేపల వ్యాపారం కనీసం మరో మూడురెట్లు పెరుగుతుంది. ఇందుకు అవసరమైన ప్రచారాన్నినిర్వహించి ప్రజలకు అందుబాటులో చేపల ఆహారాన్ని తీసుకురావాలి. వాడవాడలో చికెన్ సెంటర్లు అందుబాటులో ఉన్నట్లుగానే, పరిశుభ్రమైన చేపల ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర జనాభా (3.6కోట్లు)లో మాంసాహారం తీసుకునే వారిసంఖ్య (జనాభాలో 64 శాతం – 2.3 కోట్లమంది)లో కనీసం సగం మంది (అంటే 1.15కోట్లమంది) సగటున ప్రతినెలా కనీసం 250 గ్రాముల (పావు కిలో) చేపలను ఆహారంగా తీసుకుంటే కనీసం 2.125 మిలియన్ టన్నుల చేపలు అవసరం అవుతాయి. ఈ లెక్కన స్థానిక వినియోగానికి అవసరానికే మన రాష్ట్రంలో చేపల ఉత్పత్తికి ఉన్న అవకాశాలను లెక్కవేయవచ్చు.

**అనుబంధ పరిశ్రమలు:–** మత్స్యపరిశ్రమకు అనుబంధంగా అనేక చిన్నతరహా, సూక్ష్మ, కుటీర పరిశ్రమలను నెలకొల్పేందుకు అద్భుతమైన అవకాశాలున్నాయి. వీటిని ప్రోత్సహించడం ద్వారా మత్స్యకార్మికకుటుంబాలకు చెందిన వేలాదిమంది యువతకు ఉద్యోగ, స్వయంఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు అవకాశాలున్నాయి. 'చేప నూనె' (ఫిష్ ఆయిల్)కు ప్రపంచ వ్యాపితంగా బాగా డిమాండు ఉన్నది. కానీ తెలంగాణ ప్రాంతంలో ఇంతవరకూ ఈ అంశంపై కనీస ప్రయత్నాలు జరగలేదు. తెలంగాణలో 'చేప నూనె' ఉత్పత్తికి గల అవకాశాలను పరిశీలించి, అందుకు అనుగుణంగా అనుబంధ పరిశ్రమను స్వయం ఉపాధి పథకాల ద్వారా ప్రోత్సహించాలి. ఎండు చేపల ప్రాసెసింగ్, చేపల ప్యాకింగ్, చేపల ట్రాన్స్‌పోర్టు, చేపలను నిలువ చేయడం, చేపపొట్టుద్వారా 'కోళ్లదాణా' తయారీ, తదితర అనేక రకాలైన ఉప ఉత్పత్తులను కుటీల, చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ఉన్న అవకాశాలను

అధ్యయనం చేయాలి.

అలంకరణ చేపల (ఆర్నమెంటల్ ఫిషరీస్) ఉత్పత్తికి కూడా మన రాష్ట్రంలో పుష్కలమైన అవకాశాలున్నాయి. తెలంగాణలో పట్టణీకరణ చాలా వేగవంతంగా పెరుగుతున్న నేపథ్యంలోనూ, సేవారంగంలో విపరీతమైన పెట్టుబడులు చేరుతున్న పరిస్థితుల్లోనూ అలంకరణ చేపల ఉత్పత్తికి మన రాష్ట్రంలో విపరీతమైన అవకాశాలు పెరుగుతున్నాయి. చిన్నతరహా పరిశ్రమలుగానూ, చేపల ఉత్పత్తి నర్సరీలకు అనుబంధంగానూ అలంకరణ చేపల ఉత్పత్తిని నిర్వహించేందుకు అవకాశాలున్నాయి. అంతేకాకుండా అలంకరణ చేపల ఉత్పత్తి, మార్కెటింగ్ సౌకర్యాలకు ఎన్.ఎఫ్.డి.బి సంస్థ ప్రోత్సాహక పెట్టుబడులకు పలు పథకాలను రూపొందించి అమలు పరుస్తున్నది.

కేరళ రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న 'ఫిషరీస్ టూరిజం' దేశవ్యాపితంగా అందరినీ ఆకర్షిస్తున్నది. చైనా, అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలలో 'ఫిషరీస్ టూరిజం' ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. అయితే ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ ఆధారంగా 'ఫిషరీస్ టూరిజం' అభివృద్ధిపరచడం కొంత శ్రమతోకూడుకున్నదే అయినప్పటికీ, ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ ఈ రంగం మీద ఆసక్తి పెరుగుతున్నది. ఎకో టూరిజంలో భాగంగా 'ఫిషరీస్ టూరిజం'ను అభివృద్ధి పరిచేందుకు అవకాశాలున్నాయి. రానున్న కాలంలో తెలంగాణలో నిర్మాణం పూర్తికానున్న సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, ప్రధాన కాలువలకు అనుసంధానంగా 'ఫిషరీస్ టూరిజం' అభివృద్ధి పరిచేందుకు అవకాశాలున్నాయి. పర్యాటకులు నేరుగా చేపలు పట్టడం, తమకు ఇష్టమైన చేపలను తామే పట్టుకుని వండించుకుని భుజించడం, అలంకరణ చేపలతో పలు క్రీడావిన్యాసాలను అభివృద్ధి పరచడంలాంటి అనేక అవకాశాలు ఉన్నాయి. అందువల్ల 'ఫిషరీస్ టూరిజం'పై తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉన్నది.

**చేపపిల్లల (సీడ్) ఉత్పతి:-** తెలంగాణ రాష్ట్రంలోని చెరువుల్లో చేపలు పెంచడానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం 300 కోట్ల చేపపిల్లలు (సీడ్) అవసరం ఉంటుంది. కొత్తగా నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేస్తున్న చెరువులు, ఇతర నీటి వనరుల్లో పూర్తిస్థాయిలో చేపల పెంపకాన్ని చేపట్టిన పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక అవసరాలు సుమారు 500కోట్ల చేపపిల్లల దాకా పెరిగేందుకు అవకాశాలున్నాయి. ఈ మేరకు స్థానికంగా సగటున కోటి చేపపిల్లల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన కనీసం 500 ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పేందుకు అవకాశాలున్నాయి. ప్రతి కేంద్రంలో శిక్షణపొందిన కనీసం 10మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించగలిగినా ఒక్క చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాల ద్వారానే ప్రత్యక్షంగా ఐదువేలమందికి, పరోక్షంగా మరో ఐదు వేలమందికి మొత్తంగా పదివేలమంది యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవీలుంటుంది. అంతేకాకుండా స్థానికంగా చేపపిల్లల ఉత్పత్తి ఫలితంగా రవాణా తదితర ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయి.

**దాణా (ఫీడ్) ఉత్పత్తి:-** సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల పెంపకంలో చేపవిత్తన దశ నుండి సాధారణదశకు చేపలు పెరిగే వరకూ కృత్రిమదాణాను వేయడం సర్వసాధారణంగా మారిపోయింది. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకూ ఇందుకు అవసరమైన దాణా ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పలేదు. చేప విత్తనాలకు ఆంధ్రా ప్రాంతం మీద ఆధారపడినట్లుగానే, చేపల దాణా కోసం కూడా మన రాష్ట్రం పూర్తిగా ఆంధ్రా కంపెనీల మీదనే ఆధారపడుతున్నాయి. చేపదాణా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన రుణ సౌకర్యాన్ని, పెట్టుబడిని సబ్సిడీపై అందజేసేందుకు 'నేషనల్ ఫిషరీస్ డెవెలప్‌మెంట్ బోర్డు' (ఎన్.ఎఫ్.డి.బి) సంస్థ అనేక పథకాలను అమలు పరుస్తున్నది. ఈ విషయంలో ఫిషరీస్ సొసైటీలను ఈ సంస్థ ఇతోధికంగా ప్రోత్సహిస్తున్నది. అయితే సరైన అవగాహన, ప్రచారం లేని కారణంగా తెలంగాణ ప్రాంతంలో చేపల దాణా ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడంపట్ల తగిన ఆసక్తి కనిపించడంలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తగిన చొరవను ప్రదర్శించి, దాణా కేంద్రాల నిర్వహణలో ఎంపిక చేసిన యువతీయువకులకు అవసరమైన శిక్షణను

ఇచ్చి ప్రోత్సహించగలిగితే మరో ఐదువేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**పనిముట్లు, పరికరాలు:–** తెలంగాణ రాష్ట్రంలో చేపల పెంపకంలోనూ, ఉత్పత్తిలోనూ, మార్కెటింగ్‌లోనూ ఇంకా ఎక్కువ శాతం సాంప్రదాయపద్ధతులపైనే ఆధారపడుతున్నారు. భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపల పెంపకానికి సంబంధించిన మెళకువలుగానీ, ఆధునిక ఫిషింగ్ విధానాలుగానీ ఇక్కడి ఫిషరీస్ సొసైటీ సభ్యులకు అందుబాటులోకి రాలేదు. మారిన పద్ధతులు, పరిస్థితులకు అనుగుణంగా చేపల పెంపకంలోనూ, ఉత్పత్తిలోనూ, మార్కెటింగ్ విధానాలలోనూ మార్పులు తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. చేపల పెంపకంలోనూ, ఉత్పత్తిలోనూ, మార్కెటింగ్‌లోనూ, విక్రయంలోనూ అవసరమైన పనిముట్లు, పరికరాలు, యంత్రాలు, యంత్రవిడిభాగాలను తయారు చేయడానికి అవసరమైన చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడంద్వారా అనేక మందికి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేవీలున్నది.

**నిరంతర శిక్షణ:–** అన్నిరంగాలలో ఆధునిక టెక్నాలజీ భాగస్వామ్యం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఎప్పటికప్పుడు మారిపోతున్న పరిస్థితుల్లో మత్స్యకార్మికులను కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తయారుచేయడానికి అవసరమైన శిక్షణ, వృత్తివిద్యను అందించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా మారుతున్నపని విధానాలు, యాంత్రీకరణ, టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా పురాతన సాంప్రదాయాలనుండి, కఠోరమైన శారీరక శ్రమనుండి మత్స్యకార కుటుంబాలను విముక్తం చేసి, ఆధునిక యుగంలో వారిని కూడా భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉన్నది. మారుతున్న పోటీని తట్టుకోవడానికి, ఉత్పత్తి ఉఉత్పాదకతలను పెంచడానికి, నాణ్యమైన, పరిశుభ్రమైన చేపల ఆహారాన్ని ప్రజలకు అందించడానికి కూడా మత్స్యకారులకు నిరంతరమైన శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. రానున్న ఐదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు పదిలక్షలకు చేరుకోనున్న మత్స్యకారులకు నిరంతరం శిక్షణను అందించడానికి కనీసం జిల్లాకో మత్స్యపారిశ్రామిక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**ఫిషరీస్ విద్యాసంస్థలు:–** సీమాంధ్ర పాలకులు అనుసరించిన ప్రాంతీయ వివక్ష, పక్షపాతధోరణి, నిర్లక్ష్యవిధానాలు తెలంగాణ ప్రాంతంలో మత్స్యపరిశ్రమ పూర్తిగా వెనకబడిపోవడానికి కారణమయినట్లుగానే, ఈ రంగానికి సంబంధించిన విద్యావ్యవస్థ ఆనవాళ్లుకూడాలేని రీతిలో కనుమరుగయ్యింది. చేపల ఉత్పత్తిలో వెనకబడిఉన్న రాష్ట్రాల్లో సైతం ఫిషరీస్‌కు సంబంధించిన ప్రత్యేక కోర్సులు, కళాశాలలు నిర్వహిస్తున్నారు. ఫిషరీస్‌కు సంబంధించి జాతీయస్థాయిలో ఎనమిది పరిశోధనాకేంద్రాలు, సాంకేతిక సంస్థలు, ప్రత్యేకంగా 27 ఫిషరీస్ కళాశాలలు, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమ బెంగాల్‌లాంటి రాష్ట్రాలలో ఏకంగా ప్రత్యేకించి ఫిషరీస్ విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తుండగా తెలంగాణ రాష్ట్రంలో కనీసం పూర్తిస్థాయి డిగ్రీ కోర్సుకూడా నిర్వహించడంలేదు. ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ సెక్టార్)లో దేశంలోనే గణనీయమైన అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకించి ఫిషరీస్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంతోపాటు, జాతీయ పరిశోధనా సంస్థలకు సంబంధించిన ప్రాంతీయ కేంద్రాలు, పరిశోధనా కేంద్రాలను నెలకొల్పేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరగాల్సిఉంది. అవసరమైతే ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)కు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

**జాతీయ సంస్థలతో సమన్వయం:–** దేశవ్యాపితంగా మత్స్యపరిశ్రమను సర్వతోముఖాభివృద్ధి దిశలో నడిపించేందుకు జాతీయ స్థాయిలో అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిల్లో ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)పై ఏర్పాటు చేసిన జాతీయస్థాయి అభివృద్ధి మరియు పరిశోధనా సంస్థలు ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. ప్రధానంగా 'జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి'కి అనుబంధంగా నిర్వహిస్తున్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ' (సి.ఐ.ఎఫ్.టి–ఐ.ఐ.టి స్థాయి సంస్థ) మరియు 'సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సిఫ్రీ) చాలా ముఖ్యమైనవి. వీటితో ఎప్పటికప్పుడు సమన్వయం సాధించడంవల్ల

ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)లో ప్రపంచవ్యాపితంగా వస్తున్న మార్పులు, శాస్త్రసాంకేతిక రంగాలలో వెలుగుచూస్తున్న ఆవిష్కరణలు, నీలివిప్లవంలో భాగస్వామ్యం కావడానికి ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఆవగాహన పెంచుకోవడానికి అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా ప్రకృతిలోనూ, వాతావరణంలోనూ, పర్యావరణపరంగానూ, ప్రకృతివైపరీత్యాల ఫలితంగానూ వస్తున్న మార్పులకు సంబంధించిన అతి సున్నితమైన అంశాలపై కూడా తగిన సమాచారాన్ని సమకూర్చుకునేందుకు అవకాశాలు లభిస్తాయి.

**ఎన్.ఎఫ్.డి.బి సహకారం :–** మనదేశంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రణాళికను అమలు పరచడంలో 'నేషనల్ ఫిషరీస్ డెవెలప్‌మెంట్ బోర్డు' (ఎన్.ఎఫ్.డి.బి) ప్రధాన పాత్రను నిర్వహిస్తుంది. 2006సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఎన్.ఎఫ్.డి.బి. జాతీయ ప్రధాన కార్యాలయం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. కేంద్ర వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న పశుసంవర్థక, పశు గణాభివృద్ధి మరియు మత్స్యపరిశ్రమ ఆధీనంలో స్వతంత్రప్రతిపత్తితో పనిచేస్తున్న ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వం మత్స్యపరిశ్రమ అభివృద్ధిలో భాగంగా చేపట్టే పథకాలన్నింటినీ రాష్ట్రాలలో అమలు పరిచే బాధ్యతలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా నిర్వహించే మత్స్యశాఖ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర ఔత్సాహికులకు సంబంధించిన చేపల పెంపకం ప్రక్రియతో సంబంధకలిగిఉన్న కార్యక్రమాలన్నింటికీ నిధుల కేటాయింపు, సబ్సిడీల వితరణ, తదితర పథకాలను అమలుచేస్తూ, ఇందుకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తుంది. రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధిని వేగవంతంగా, మరింత సమర్థవంతంగా, నిధుల కొరతలేకుండా సాధించేందుకు ఎన్.ఎఫ్.డి.బి సహకారం ఎంతో అవసరం. ఇందుకు అవసరమైన బాధ్యతాయుతమైన ఒక ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతైనా అవసరం. అయితే ఎన్.ఎఫ్.డి.బి. జాతీయ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉన్నప్పటికీ గడచిన పది సంవత్సరాల కాలంలో కనీసం ఒక్కరు కూడా ఈ సంస్థ బోర్డులో తెలంగాణ ప్రాంతం నుండి సభ్యులుగా నియమించకపోవడం ఆశ్చర్యకరం.

**జాతీయ విధానం:–** ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)కు సంబంధించిన భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు అవసరమైన జాతీయ విధానాన్ని తయారుచేసేందుకు గత సెప్టెంబర్‌లోనే నిపుణులతో కూడిన ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉపరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)లో ప్రధాన భూమికను పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు సంబంధించిన వారికి ఈ జాతీయ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించారు. ఉ పరితల జల వనరుల చేపల పెంపకం (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్)కు సంబంధించి నీటిసామర్థ్యంలో దేశంలోనే మూడవ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఈ కమిటీలో కనీసం చోటు దక్కలేదు. పదమూడుమంది నిపుణులతో కూడిన ఈ కమిటీ భవిష్యత్తులో ఉపరితల జల వనరుల చేపల పెంపకానికి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) సంబంధించిన జాతీయ విధానాన్ని రూపొందించే అతిముఖ్యమైన పనిని నిర్వహిస్తుంది. దేశంలోనే కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికున్న ప్రత్యేక అవసరాలు, గతంలో జరిగిన అన్యాయాలు, ఎదురైన వివక్షత తదితర కీలకమైన అంశాలను ప్రస్తావించి, మన రాష్ట్రానికి ఒక ప్రత్యేక ప్యాకేజీని ఈ 'విధానరూపకల్పన'లోనే ప్రతిపాదించేందుకు ఈ కమిటీలో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రత్యేకంగా ఒక సభ్యుడు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 2017 జనవరినాటికి ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ పాలసీ ప్రతిపాదనలను సిద్ధం చేయనున్న నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యవసరంగా కేంద్రప్రభుత్వంతో ప్రస్తావించడం తక్షణకర్తవ్యం.

## మత్స్య అభివృద్ధి కేంద్రాలు

కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని ముఖ్యమైన జలాశయాలు (రిజర్వాయర్లు) నిర్మించుకున్న ప్రాంతాలలో 'సమగ్ర మత్స్య పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాలు' (ఇంటగ్రేటెడ్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ డెవెలప్‌మెంట్ సెంటర్స్ – ఐ.ఎఫ్. డి.సి) నెలకొల్పాలి. చేపవిత్తనాలకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ

(రేరింగ్)యూనిట్ నుండి టేబుల్‌సైజ్ చేపల పెంపకం నిర్వహించే ఫిష్ నర్సరీ, ఫిష్ పాండ్స్ నిర్వహణ వరకు ఇక్కడ ఏర్పాటు చేయాలి. మత్స్యపారిశ్రామిక సంఘాలకు ఈ కేంద్రాలు మార్గదర్శకంగా పనిచేయాలి. ఇక్కడ ఒక శిక్షణా కేంద్రాన్ని కూడా నెలకొల్పాలి. రాష్ట్రం నలుమూలలా అన్ని ప్రాంతాల మత్స్యకారులకు అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రాజధాని సమీపంలోకూడా (మల్లన్నసాగర్) ఇట్లాంటి ఒక కేంద్రాన్ని నిర్వహించాలి. దేశవ్యాపితంగా నిర్వహిస్తున్న 'ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల' తరహాలో వీటిని నిర్వహించాలి. దేశంలోని వివిధ మత్స్యపరిశోధనా సంస్థలు, మత్స్య విశ్వవిద్యాలయాలు, ఈ రంగానికి సంబంధించిన అంతర్జాతీయ సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి.

**భీమా సౌకర్యం:-** చేపల పెంపకం కేంద్రాల నిర్వహణలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకునే రీతిలో భీమా సదుపాయాన్ని కల్గజేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా ఫిషరీస్‌కు అనుబంధంగా ఉపయోగించే ఉపకరణాలు, యంత్రాలు, పరికరాలకు కూడా భీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలి.

**సింగిల్ విండో విధానం:-** చేపల ఉత్పత్తి కేంద్రాలను, చేపల సీడ్ ఉత్పత్తి, దాణా తయారీ కేంద్రాల ఏర్పాటు, చేపల ఉత్పత్తిలో వివిధ దశల్లో ఉపయోగించే పరికరాలు, ఉపకరణాలు, యంత్రాల కొనుగోలు తదితర కేంద్రాలకు అవసరమయ్యే రుణపరపతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు, సబ్సిడీలు, బ్యాంక్ గ్యారంటీ, భూమి కేటాయింపు, శిక్షణ తదితర అంశాలన్నింటినీ సమన్వయ పరిచేందుకు జిల్లా స్థాయిలో ఒక సమీకృత సహాయ కేంద్రాన్ని సింగిల్ విండో పద్ధతిలో నెలకొల్పాలి.

**సాధికారిక కమిటీ ఏర్పాటు:-** చిన్నతరహా సమగ్ర చేపల ఉత్పత్తి మరియు దానికి అనుబంధంగా అవసరమయ్యే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, చిన్నతరహా దాణా ఉత్పత్తి కేంద్రాలు, ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లు, చేపల విక్రయ కేంద్రాలు, ప్యాకింగ్ యూనిట్లు తదితర సూక్ష్మ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన సాధికారిక కమిటీని ఏర్పాటు చేయాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న స్వయం ఉపాధి, కుటీర, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటును ఈ సాధికారిక కమిటీ పరిధిలోకి తీసుకురావాలి.

**పరిశోధన మరియు అభివృద్ధి:-** చేపల ఉత్పత్తి రంగంలో అవసరమైన పరిశోధన మరియు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు అనువుగా ప్రతి జిల్లాకు కనీసం 5కోట్ల రూపాయల ప్రత్యేక నిధిని అందుబాటులో ఉంచాలి. పేరొందిన పరిశోధన సంస్థలు స్థానికంగా నిర్వహించే పరిశోధన మరియు శిక్షణ కార్యక్రమాలకు అవసరమయ్యే నిధులలో గరిష్టంగా 60శాతం సబ్సిడీ అందించాలి. పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (పిపిపి) పద్ధతికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. స్థానికంగా లభ్యమయ్యే సాంప్రదాయ చేపల రకాలు అంతరించకుండా కాపాడటం, అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించుకొని అమలు చేయాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, మత్స్య సహకార సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సాహించాలి.

**పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి):-** చేపలను సేకరించే కేంద్రాలను (ఫిష్ లాండింగ్ సెంటర్స్) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఉమ్మడి భాగస్వామ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలి. చేపల విక్రయాన్ని, వినియోగాన్ని పెంచేందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా ప్రైవేటు రంగంలో నిర్వహిస్తున్న అధునాతన మాల్స్, సూపర్ మార్కెట్లు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, స్టాల్స్ తదితరాల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

**ఎగుమతి విధానం:-** చేపల ఎగుమతిని ప్రోత్సహించేందుకు కేజ్ కల్చర్ పద్ధతిలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. చేపల ఉత్పత్తి మరియు అభివృద్ధిని ప్రోత్సహించి చేపల ఆహారాన్ని తయారుచేసే రంగాన్ని ఏర్పాటు చేయటానికి అనువైన పట్టణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. చేపల ఆహారాన్ని కూడా ఎగుమతి చేసేందుకు వీలున్న మార్గాలను అన్వేషించాలి. తెలంగాణ రాష్ట్రంలోని సాంప్రదాయ నీటివనరుల్లో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆదరణ అధికంగా

ఉన్నది. ఇక్కడి సారవంతమైన నేలలు, నీటి పరిశుభ్రత, సమశీతోష్ణపరిస్థితులు, వాతావరణం, ప్రకృతివనరులు, తదితర అనేక కారణాలవల్ల ఇక్కడి జలవనరుల్లో పెరిగే చేపల్లో పోషక విలువలతోపాటు ఆరోగ్యసంబంధమైన ఔషధగుణాలుకూడా కలిగిఉంటాయని నమ్ముతారు. హైదరాబాద్‌లో ప్రతియేటా ఉబ్బసవ్యాధిగ్రస్తులకు నిర్వహించే 'చేపమందు' ఆదరణ వెనక రహస్యంకూడా ఇదేనంటున్నారు. తెలంగాణ ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న చేపలను ముఖ్యంగా ముంబాయి, కోల్‌కత్తా, జల్‌పాయిగురి, సిలిగురి, నాగపూర్, చంద్రాపూర్, భివాండీ, ఔరంగాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ఈ ఎగుమతి ప్రక్రియలో తెలంగాణ ప్రాంతంలోని మత్స్యకారులకు ఎలాంటి సంబంధం లేకుండా ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లు, మధ్య వ్యాపారులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలోనూ స్థానిక మత్స్యకార యువతను ప్రోత్సహించగలిగితే అనేకవేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

**మత్స్యకారుల సంక్షేమం:-** మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భాలలో వారి కుటుంబ జీవనాధారాన్ని నిలబెట్టేందుకు కనీసం రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందించాలి. శాశ్వత అంగవైకల్యం అనుభవించే మత్స్యకారులకు రూ. 2లక్షలు అందించాలి. భారీ వర్షాలు, వరదలు, తుఫాను, వడగాల్పులు, మోతాదుకు మించిన ఎండ తీవ్రత తదితర ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన హెచ్చరికలను ఎప్పటికప్పుడు మత్స్యకారులకు అందించే ఏర్పాటు చేయాలి. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే కారక పరిశ్రమల పట్ల కఠినంగా వ్యవహరించాలి. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాల వల్ల మత్స్యకారుల ఉపాధికి ఆటంకాలు ఏర్పడిన సందర్భాలలో సంబంధిత పరిశ్రమల నుంచి నష్టపరిహారాలను రాబట్టే నిబంధనలను రూపొందించాలి. చేపల పెంపకం మీద పూర్తికాలం ఆధారపడిన మత్స్యకారులందరికీ నిరంతరం ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలి. మత్స్యకారుల కుటుంబాలకు నివాసయోగ్యమైన గృహవసతి, రక్షిత మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి. మత్స్యకార వృత్తిపై ఆధారపడిన ఎస్సీ, ఎస్టీ మరియు మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలుజరిపే ప్రోత్సాహకాలను అందించాలి. చేపల వేటను నిషేధించిన కాలం (మార్చి, ఏప్రిల్, మే మాసాలు) లో జీవనభృతిని కొనసాగించేందుకు ప్రత్యేక ప్యాకేజీని అమలు జరపాలి. చిన్నతరహా నీటి వనరులు (మైనర్ ఇరిగేషన్), గ్రామపంచాయతీ ఆధీనంలోని చెరువులు, కుంటలను అర్హత కల్గిన మత్స్యసహకార సొసైటీలకు మాత్రమే మూడు సంవత్సరాల కాలపరిమితి కోసం లీజు పద్ధతిలో కేటాయించాలి.

The Writer is a :

Founder: Mudiraj Research Centre (MRC)
Advisor : Telangana Mudiraj Mahasabha (TMM)
Member: Fisheries Cooperative Society (FCS)

# మత్స్యపరిశ్రమకు సంబంధించిన గణాంకాలు

## తెలంగాణ రాష్ట్రంలో చేపల ఉత్పత్తి

| సంవత్సరం | ఉత్పత్తి (టన్నుల్లో) |
|---|---|
| 2008-09 | 1,49,049 |
| 2009-10 | 1,33,613 |
| 2010-11 | 1,33,587 |
| 2011-12 | 1,96,708 |
| 2012-13 | 2.14,591 |
| 2013-14 | 2,43,037 |
| 2014-15 | 2,60,010 |
| 2015-16 | 2,28,185 |

## ఉపరితల చేపల ఉత్పత్తి జలవనరులు (హెక్టార్లలో ...)

| రాష్ట్రం | నదులు-కాలువలు | రిజర్వాయర్లు | చెరువులు | సరస్సులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఒడిషా | 4500 కి.మీ. | 2,56,000 | 1,23,000 | 1,80,000 | 9,89,000 |
| ఆంధ్రప్రదేశ్ | 11514 | 2,34,000 | 5,17,000 | - | 8,11,000 |
| కర్నాటక | 9000 | 4,40,000 | 2,90,000 | - | 7,40,000 |
| తమిళనాడు | 7420 | 5,70,000 | 0,56,000 | - | 6,93,000 |
| పశ్చిమ బెంగాల్ | 2526 | 0.17,000 | 2,76,000 | - | 5.45,000 |

## భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో చేపల ఆహార వినియోగం

| నెలలో తలసరి వినియోగం (కిలోలు) | | | | (ప్రతి 1000 మందిలో చేపలు తినేవారి సంఖ్య) | | |
|---|---|---|---|---|---|---|
| రాష్ట్రం | గ్రామీణ | పట్టణ | సగటు | గ్రామీణ | పట్టణ | సగటు |
| త్రిపుర | 1.777 | 1.488 | 1.3325 | 976 | 938 | 957 |
| గోవా | 2.071 | 1.750 | 1.9105 | 994 | 893 | 943 |
| అస్సాం | 0.686 | 0.991 | 0.8385 | 896 | 875 | 886 |
| బెంగాల్ | 0.813 | 1.082 | 0.9475 | 879 | 844 | 862 |
| కేరళ | 2.117 | 1.958 | 2.0375 | 884 | 817 | 851 |
| ఆంధ్ర | 0.197 | 0.131 | 0.164 | 191 | 136 | 164 |

## దేశంలో చేపల ఉత్పత్తులు (ప్రధాన రాష్ట్రాలలో 2013-14 సంవత్సరంలో ...)

| రాష్ట్రం | ఇన్‌ల్యాండ్ | సముద్రంలో | మొత్తం | ఫిష్ సీడ్ ఉత్పత్తి (మిలియన్ ఫ్రై) |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 1580.17 | 438.25 | 2018.42 | 6562.63 |
| పశ్చిమ బెంగాల్ | 1392.40 | 188.45 | 1580.85 | 15890.00 |
| గుజరాత్ | 97.84 | 695.58 | 793.42 | 387.00 |
| కేరళ | 186.34 | 522.31 | 708.65 | 18.00 |
| తమిళనాడు | 192.03 | 432.27 | 624.30 | 2871.50 |
| ఆలిండియా | 6140.00 | 3440.00 | 9580.00 | 41450.00 |